వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్టని పాలకులు

- నిధులు, నీళ్ల కోసం ఉద్యమం : సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై పాలకులకు ఎలాంటి శ్రద్ధ లేదని, ప్రాంతాల అభివృద్ధి కోసం నిధులు, నీళ్లకై ఉద్యమిద్దామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలు నగరంలోని కార్మిక కర్షక భవన్‌లో సిపిఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి ఆనంద్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి వి.రాంభూపాల్, రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి మాట్లాడారు. రాష్ట్ర విభజన అనంతరం ప్రధానంగా చర్చ వచ్చిన అంశం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి అని, కానీ ఆ అభివృద్ధి పట్ల పాలకులకు ఎలాంటి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. విభజన చట్టంలోని సెక్షన్ 44 లో స్పష్టంగా కేంద్ర ప్రభుత్వం వెనకబడిన ప్రాంతాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి ప్రోత్సహించాలని బుందేల్‌ఖండ్ ప్యాకేజీ ఇవ్వాలని కెపిబి తరహా రూ.19 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ద్వారా అభివృద్ధి చేయాలని ఉందన్నారు. ఈ 12 సంవత్సరాల కాలంలో మాటల నీటి మూటలు తప్ప ఫలితం ఏమీ లేదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఈ వెనకబడ్డ జిల్లాల్లోని 67శాతం జనాభా ఉందని, 71శాతం వ్యవసాయ సాగుభూమి ఉందన్నారు. అయితే కేవలం 17 శాతం భూమికి మాత్రమే సాగునీటి వనరులు ఉన్నాయన్నారు. సాగు భూమికి తగ్గ నీటి వనరులను కేటాయించడంలో పాలకులు విఫలం చెందారన్నారు. ఒకవైపు ప్రాంతం ఎడారిగా మారుతున్నా, స్థానిక ప్రజా ప్రతినిధులు చోద్యం చూస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. అన్నమయ్య జిల్లాలో బంగారం కంటే 150 రెట్లు ఎక్కువ విలువ ఉన్న పొలిటిన్ లభ్యమయ్యే అవకాశం ఉందన్నారు. రాయలసీమలోని ప్రాంతంలో 64 రకాల ఖనిజ వనరులు ఉన్నాయని పరిశోధనలో తేలిందన్నారు. వీటి ఆధారంగా పరిశ్రమలు ఎందుకు పెట్టరాదని ప్రశ్నించారు. ఇప్పటికే డోన్ దగ్గర సున్నపురాయి పరిశ్రమ, ఎమ్మిగనూరు దగ్గర చేనేత పరిశ్రమ, బేతంచర్ల దగ్గర నాపరాయి పరిశ్రమ, ఆదోనిలో మార్కెట్, ధర్మవరం దగ్గర హ్యాండ్లూమ్ లాంటి పరిశ్రమలు పెట్టి అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉన్నా వాటిని అభివద్ధి చేయడంలో మాకు పట్టదు అన్నట్లు పాలకుల వ్యవహారం ఉందన్నారు. నీళ్లు, నిధుల కోసం, వెనకబడ్డ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త ప్రజలను కదిలించి పోరాటాలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్. రాధాకృష్ణ, జి.రామకృష్ణ, టి .రాముడు, కెవినారాయణ, ఎండి.అంజిబాబు, నగర కార్యదర్శి ఎం. రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు అరుణమ్మ, గురుశేఖర్, నగేష్, విజయ్, నాగన్న, మోహన్, వివిధ పట్టణ మండలాల నుండి కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వి.రాంభూపాల్

ఈ దాహం తీరేదెన్నడు..?

- ఆగిన బిల్లులు.. నిలిచిన పనులు
- మద్దికెర మండల కేంద్రంలో తాగునీటి కష్టాలు
- మౌలిక సదుపాయాల కల్పనలో పాలకులు విఫలం

ప్రజాశక్తి - మద్దికెర

ఎక్కడైనా వేసవి కాలంలో తాగునీటి సమస్యలుంటాయి. పశ్చిమ ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో ఎప్పుడూ తాగునీటి ఎద్దడి వెంటాడుతోంది. మద్దికేర మండల కేంద్రంలోని సాయినగర్ ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో ప్రభుత్వం దాదాపు 20 ఏళ్ల క్రితం 300 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇల్లు నిర్మించుకొని, దశాబ్దాలు గడుస్తున్నా కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ఆగిన బిల్లులు, నిలిచిన పనులు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన రూ.కోటి 80 లక్షలతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామంతో పాటు, సాయి నగర్‌లో ఓవర్ ట్యాంకు పైపులైను, ఇంటింటి కొళాయి కనెక్షన్లను మంజూరు చేసింది. సాయి నగర్‌లో మాత్రం ట్యాంకు నిర్మించడంతోపాటు పైప్ లైను పనులు కూడా పూర్తయ్యాయి. కాంట్రాక్టర్ ట్యాంకుకు నీటి కనెక్షన్ చేయలేదు. ప్రజలకు నీటి సమస్య తీరడం లేదు. ప్రభుత్వం దాదాపు 40 లక్షల దాకా బిల్లులు పెండింగ్ ఉంచడంతో, పనులు ఆగినట్లు తెలుస్తుంది.

అలంకార ప్రాయంగా ఉన్న ట్యాంక్

ప్రజలకు తప్పని నీటి కష్టాలు : సాయి నగర్ లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. సాయినగర్ ప్రజలకు దశాబ్దాలుగా నీటి కష్టాలు తప్పడం లేదు. జలజీవన్‌మిషన్ ద్వారా తమ కష్టాలు తీరుతాయని ఆశిస్తే, పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో, సమస్య అలాగే కొనసాగుతుంది. కాలనీవాసులు నీటి కోసం బిందెలు పట్టుకొని, రోడ్డుపై ఉన్న నీటి ట్యాంకర్ వద్దకు వెళ్లి తెచ్చుకోవలసి వస్తుంది. ప్రతిరోజు కాలనీవాసులు నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. కొంతమంది సైకిల్ మీద స్కూటర్ మీద తెచ్చుకోవలసిన దుస్థితి ఉంది.

20 ఏళ్లుగా నీటి సమస్య ఉంది



కాలనీలో 20 ఏళ్లుగా నీటి సమస్య ఉంది. అప్పటినుంచి గ్రామంలోని ప్రధాన రహదారి వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నాం. జల జీవన్ మిషన్ ద్వారా నీటి సమస్య తీరుతుందని ఆశిస్తే, పనులు అర్ధాతరంగా ఆగిపోయాయి. ప్రభుత్వం స్పందించి పనులు పూర్తి చేసి, నీటి సమస్యను తీర్చాలి.

- నరసింహులు

నీటి సమస్యను తీర్చండి

మా కాలనీలో 20 ఏళ్లుగా నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నాం.రోడ్డుపైకి వచ్చి ప్రతిరోజు నీరు తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేసి మంచినీటిని అందించాలి.

- చొక్కా సునీల్ కుమార్.

త్వరలో నీటి సమస్యను తీరుస్తాం

ఆగిపోయిన పనులను వెంటనే ప్రారంభించి, కాలనీలో నీటి సమస్య లేకుండా చూస్తాం. ట్యాంకుకు పైపులైను ద్వారా నీటిని అందించి, ఇంటింటికి నీటిని సరఫరా చేసేలా చూస్తాం.

- ఆర్‌డబ్ల్యుఎస్ఎఇ మయాంగ్ సింగ్.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అన్నారు. ఆదివారం ఎపియుడబ్ల్యుజె 69వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వెంకటరమణ కాలనీలోనికీర్తన ఆనాధాశ్రమంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఇఎన్.రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు. అన్నదాన వితరణ కార్యక్రమం చేసిన అనంతరం వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు ఎన్‌వి. సుబ్బయ్య, సీనియర్ ఫోటో జర్నలిస్టు ఆంజనేయులు, సీనియర్ వీడియో జర్నలిస్టు చాంద్ బాషాను ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. కొండప్ప, ఐజెయు జాతీయ సమితి సభ్యులు కె.నాగరాజు, ఎపియుడబ్ల్యుజె జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎన్‌విజ సుబ్బయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి శివరాజ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, వీడియో జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు స్నేహాల్, సీనియర్ జర్నలిస్టులు శ్రీకాంత్, నాయకులు మల్లికార్జున, హరి, ఫయాజ్, ఇంతియాజ్, సుధాకర్, ఫోటో జర్నలిస్టు యూనియన్ నాయకులు సుధాకర్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా,వేదికపై ఎంపీ, ఎమ్మెల్యే

ప్లాస్టిక్ రహిత జిల్లా లక్ష్యం

- అక్టోబర్ 2 నాటికి పూర్తి చేయాలి
- వినియోగిస్తూ పట్టుబడితే భారీగా జరిమానాలు
- పలు దాఫాలుగా ప్రజల్లో అవగాహన
- ఎపిపిసిబి ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

'జిల్లాలో పర్యావరణం కాలుష్యం నిర్మూలనలో భాగంగా జిల్లాను ప్లాస్టిక్ రహితంగా మార్చే లక్ష్యంతో అధికార యంత్రాంగంతో కలసి కృషి చేస్తున్నాం. నిబంధలను అతిక్రమించి ప్లాస్టిక్ సంచులు తయారు చేసినా, వినియోగించినా జరమానాలు తప్పవు. ప్రజల భాగస్వామ్యం తోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది'. అని ఎపిపిసిబి ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయనను కలసి ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖిలో పలు అంశాలను ఆయన వెల్లడించారు.

పర్యావరణ కాలుష్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

కిషోర్: ప్రస్తుత సమాజంలో ప్రతి చిన్న అవసరానికి ప్లాస్టిక్ వినియోగం అధికమైంది. దీనివల్ల వాతావరణ కాలుష్యంలో తీవ్ర మార్పులు చోటు చేసుకునే ప్రమాదం ఉంది. సాధ్యమైనంత వరకు వీటిని పూర్తిస్థాయిలో అరికట్టాలని ప్రభుత్వం నిర్దేశించి అమలుకు ఉపక్రమించింది. అందులో భాగంగా ఇప్పటికే ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు దిశగా చర్యలు చేపట్టాం. ఆపై నిబంధనలను అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలని కూడా ప్రభుత్వం నిర్దేశించింది. సింగిల్ యూస్‌ప్లాస్టిక్‌ను నియంత్రించడానికి ప్రధానంగా ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశాం. అందులో భాగంగా ఫంక్షన్ హాలులో కళ్యాణ మండపాలు ఆసుపత్రులు షాపింగ్ కాంప్లెక్స్ ,మార్కెట్లు దేవాలయాలు హోటల్స్ వంటి ప్రదేశాల్లో వినియోగాన్ని నిషేధించాం. ఇవే కాకుండా రవాణా ప్రాంతాలైన బస్‌స్టేషన్లు రైల్వే స్టేషన్లు కూడా వీటివినియోగాన్ని నిషేధించాలని ఆదేశించాం. మహిళా సంఘాలకు ప్లాస్టిక్ వినియోగం గురించి వివరించి వాటి ద్వారా ప్రజలను చైతన్యం చేస్తున్నాం.

సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగానికి బదులుగా ప్రత్యామ్నాయం ఏర్పాట్లు ఏమైనా చేస్తున్నారా?

కిషోర్: సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాగులను వినియోగించకుండా ప్రజలను వేరే ప్రత్యామ్నాయ మార్గాలైన గుడ్డ సంచులను, వైరు సంచులను, కాగితపు సంచులను, జనపనారతో తయారుచేసిన సంచులను వినియోగించాలని ప్రజలకు ఎప్పటి కప్పుడు పట్టణాల్లో మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల ద్వారా ప్రజలను చైతన్యపరిచే విధంగా ఉన్నతాధికారుల ద్వారా ఆదేశాలను ప్రభుత్వం చేరవేస్తోంది. జూట్ బ్యాగులో తయారీ బయో డిగ్రేడబుల్ సంచులు తయారీని ప్రోత్సహించేలా ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాంలో ద్వారా యూనిట్లు ఏర్పాటు చేసి పరిశ్రమల శాఖలను, ఉద్యాన శాఖల ద్వారా ప్రోత్సాహాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

పూర్తిస్థాయిలో నిషేధానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

కిషోర్: ఈ ఏడాది అక్టోబర్ 2 నాటికి ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 81 ఆదేశించి ఎపిపిసిబి అధికారుల ఆధ్వర్యంలో జరిమానాలను పెద్ద ఎత్తున నిర్ణయించింది. అందులో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తయారీ దిగుమతిదారులు మొదటిసారి పట్టుబడితే రూ.50,000, జరిమానా విధించడమే కాకుండా వస్తువులను స్వాధీనం చేసుకుంటారు. రెండోసారి పట్టుపడితే రూ.లక్ష జరిమానా, వస్తువులు, ప్లాంటును, యంత్రాలను స్వాధీనం చేసుకుంటారు. కేసు నమోదు చేసి విచారణ కూడా చేపడతారు. తయారీదారులు, దిగుమతి దారులు, ఈ కామర్స్ కంపెనీలు నిషేధించబడిన సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను పంపిణీ చేస్తూ మొదటిసారి పట్టుబడితే రూ. 25 వేలు జరిమానా, తో పాటు కేజీ ప్లాస్టిక్ కు రూ.పది చొప్పున స్వాధీనం చేసుకున్న మెసేజ్‌తో ప్లాస్టిక్‌పై జరిమానా విధిస్తారు. రెండోసారి పట్టుపడితే రూ.యాభై వేలు, కేజీకి రూ.20 జరిమానా విధిస్తారు. మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో ఎక్కడైనా సింగల్ యూస్ ప్లాస్టిక్ వినియోగించిన, అమ్మిన తొలిసారి రూ.20,000 జరిమానా వస్తువులు స్వాధీనం, రెండోసారి పట్టుపడితే రూ.40,000 జరిమానా తో పాటు వస్తువులు స్వాధీనం ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా కేసు నమోదు చేసి విచారిస్తారు. నిషేధిత ప్లాస్టిక్ ను రవాణా చేస్తూ మొదటిసారి పట్టుపడితే రవాణా శాఖ పన్నుల శాఖ ఆధ్వర్యంలో రూ. 25 వేలు జరిమానా విధించడమే కాకుండా పట్టుబడిన ప్లాస్టిక్ లో కేజీకి రూ.10 చొప్పున జరిమానా విధిస్తారు. రెండోసారి పట్టుపడితే, వాహనంతో పాటు, ప్లాస్టిక్ ను స్వాధీనం చేసుకొని రూ 50,000 జరిమానా, అదనంగా పట్టుబడిన ప్లాస్టిక్ పై కేజీకి రూ.20 చొప్పున జరిమానా విధిస్తారు. విచారణ కూడా చేపడతారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక్కడ నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి బాధితులు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవాలని కోరారు.

దెబ్బతిన్న ఆర్అండ్‌బి రోడ్డును పరిశీలిస్తున్న సిపిఎం బృందం

శిథిలమైన ఆర్అండ్‌బి రోడ్డు

-పట్టించుకోని అధికారులు -ఇబ్బంది పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని నగర నడిబొడ్డులో ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే మెయిన్ రోడ్డు పక్కనే రోడ్డు గుంతలుపడి శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోని అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ సిపిఎం బృందం సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.ఆనంద్‌బాబు, 42 వార్డు పార్టీ కార్యదర్శి సి.చలపతి మాట్లాడుతూ కర్నూలు నగరంలో ప్రధానమైన ఆర్‌టిసి బస్టాండ్ మెయిన్ రోడ్డు పక్కన ఉండే లింకు రోడ్డుకు మధ్యలో ఉండే భాగం శిథిలమై గుంతలుపడి వాహనదారులు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని అన్నారు. ఇది ఆర్ అండ్ బి వాళ్లకు సంబంధం లేదని ఇది మున్సిపాలిటీ వాళ్లే వేయాలని ఒకరి మీద ఒకరు చెప్పుకోవడం తప్ప సమస్యను పరిష్కరించడం లేదని దాని కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఆర్ అండ్ బి అధికారులు మున్సిపల్ అధికారులు సమన్వయంతో ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలను సమీకరించి ఆందోళన చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్. రాధాకృష్ణ, ఎండి.ఆనంద్ బాబు, జిల్లా నాయకులు గురుశేఖర్, ప్రభాకర్ ,యేసు రాజు తదితరులు పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ సొసైటీ సేవలు అభినందనీయం

- రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కిద్మత్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్ అన్నారు. కర్నూలు నగరంలోని ఈడెన్ గార్డెన్స్‌లో కిద్మత్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సపోర్టర్స్ మీట్ కార్యక్రమంలో ఆయన గౌరవ అతిథిగా పాల్గొన్నారు. సొసైటీ తరుపున ముస్లిం మైనారిటీలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం ఎంతో గొప్ప విషయమని ఆయన కొనియాడారు. ఈ రుణాలు చిరు వ్యాపారాలు చేసుకునే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. సొసైటీ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రుణ గ్రహీతలు తమ వ్యాపారాభివృద్ధితో పాటు పిల్లల చదువు, నైపుణ్యాభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. అప్పుడే వారి భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. సొసైటీ మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ రోడ్డు దాటేదెలా..? గమ్యం చేరేదెలా..?

-3 అడుగుల లోతులో కుంటను తలపిస్తున్న దారి
- అష్టకష్టాలు పడుతూ వెళ్తున్న వాహనదారులు

ప్రజాశక్తి-సి బెళగల్

గత ప్రభుత్వం అప్పట్లో పటించుకోలేదని ఎన్నికల ప్రచారాలలో టిడిపి నాయకులు దుయ్యాబట్టారు.. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా రోడ్ల అభివృద్ధి మాటే మరచిపోయారు. కర్నూలు జిల్లాలోనే వెనుకబడిన కోడుమూరు నియోజకవర్గంలో అత్యంత వెనుకబడిన సి బెళగల్ మండల రోడ్ల పురోగతి ఎవరికీ పట్టడం లేదు.. అందుకే అధికారులు ఉన్నారా... నాయకులు లేరా అంటూ ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు, ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. మండలంలో ఏ గ్రామానికి వెళ్లి చూసినా రోడ్ల దుస్థితి మరీఇంత దౌర్భాగ్యంగా ఎక్కడ ఉండదేమో.. అన్న ధోరణి వ్యక్తమవుతున్నాయి. అదే ఎమ్మిగనూరు కు వెళ్లే దారి కంభదహాల్ వద్ద రెండు వందల అడుగుల పొడవునా రోడ్డు ఉన్నంత వెడల్పులో మూడు అడుగుల లోతులో ఏళ్లగా గుంత ఏర్పడింది.. ఇళ్ల నుండి వచ్చే మురుగు నీరు నిత్యం నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది.. వర్షాకాలంలో అయితే వర్షపు నీరు చేరి ఎటూ కదలకుండా ఉండటంతో కనీసం ఇరు ప్రక్కలకు అడుగు స్థలం కూడా లేక గత్యంతరం లేని స్థితిలో అష్ట కష్టాలు పడుతూ ముందుకు వెళ్తున్నారు. ఎన్నాళ్ళు ఇలా..రోడ్డు దాటేదెలా.. గమ్యం చేరేదెలా ఎన్నేళ్లు ఇలా.. ఈ రోడ్డు దుస్థితి ..మారదా.. అంటూ ప్రతి నోటా ఆవేదన గుప్పిస్తున్న తీరు కలవరం రేపుతోంది.

దెబ్బతిన్న రోడ్డుపై నిలిచిన నీరు

కారును రెండు గంటలు ఆపుకున్నాం

మా కారులో ఈ కంభదహాల్ గుండా వెళ్లాలని వచ్చాం.అదే గుంత రోడ్డులో బైకులు పడుతూ లేస్తూ కనిపించాయి.. అది చూసి మా కారును రెండు గంటల పాటు ఆపుకొన్నాం. అందులో కిందపడిన పలువురు బురదతోనే ఇంటికి వెళ్లడం బాధగా అనిపించింది.

- మార్కండేయ..రాయచూరు వాసి.

ఈ గుంత దగ్గర మహిళల పాట్లు వర్ణనాతీతం

మా గ్రామంలో గుంతల మయంగా మారడంతో ఎక్కడైనా ప్రయాణం చేయాలంటే భయం భయంగా ఉంది. ఇక్కడ ఏర్పడిన గుంత దాటేంత వరకు మహిళలు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు పడుతున్న పాట్లు వర్ణనాతీ తంగా దర్శనమిస్తున్నాయి.

- ఉప్పరి వెంకటేశ్వరమ్మ.. కంభదహాల్.

ప్రజల బాధను పట్టించుకునేదెవరు..?

ఏళ్లుగా కంభదహాల్ వద్ద ఏర్పడిన గుంత కుంటను తలపిస్తోంది. ఇక్కడే అనేక ప్రమాదాలు కూడా జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఐనా రోడ్ల దుస్థితిపై ప్రజలు నాయకులకు, అధికారులకు పలుమార్లు మొర పెట్టుకొంటున్నారు.. అభివృద్ధి చేయాల్సిన వారు మొద్దు నిద్రను వీడటం లేదు.. కనీసం ప్రాథమిక చర్యలు చేపట్టక పోవడం వారు ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే...ఇలాగే వైఖరి మారక పోతే త్వరలో రోడ్ల దుస్థితి పై ఐక్య ఉద్యమ పోరు చేపట్టాల్సి ఉంటుంది.

- జె.మెహన్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు.

క్రీడాకారులను అభినందిస్తున్న టిజి వెంకటేష్

కరాటే క్రీడాకారులకు టిజివి అభినందన

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారుడు దినేష్ ను రాజ్యసభ మాజీ సభ్యులు టిజి. వెంకటేష్ అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఢిల్లీలో నిర్వహించిన కరాటే క్రీడకు ఎంపిక కావడమే కాకుండా, అక్కడ దినేష్ గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా టిజి. వెంకటేష్ మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో జాతీయస్థాయిలో దినేష్ గోల్డ్ మెడల్ సాధించడం కర్నూలు జిల్లాకే గర్వకారణం అన్నారు. నిరంతర కృషి పట్టుదల ఉంటే క్రీడలలో రాణించవచ్చునే దానికి దినేష్ ఉదాహరణ అని ఆయన అన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు, మానసిక ఉల్లాసం కూడా ఉంటుందన్నారు. ఇందువల్ల చదువు, క్రమశిక్షణ అలబడుతుందని అన్నారు. స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంగా ఆగస్టు 15న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నిర్వహించిన అట్ హోమ్ కార్యక్రమానికి దినేష్‌ను ఆహ్వానించడం క్రీడాకారులకు లభించే గౌరవమని అన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకుడు జగదీష్, రాంబాబు, డేవిడ్, ఆరిఫ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సాహిత్యంలో 'తెలుగు కథది వైవిధ్యమైన పాత్ర

- సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

భారతీయ సాహిత్యంలో తెలుగు కథ వైవిధ్యపాత్ర పోషించిందని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో 75 ఏళ్ల తెలుగు కథ అంశంపై సదస్సు కర్నూలు లలిత కళా సమితిలో ఆదివారం నిర్వహించారు. కెంగార మోహన్ సభాధ్యక్షత వహించి ప్రారంభింభోపన్యాసం చేశారు. 1947 నుంచి 2022 వరకు తెలుగు చిన్న కథలలో అనేక మార్పులు, పరిణామాలు వచ్చాయని సమాజాన్ని తీవ్ర ప్రభావితం చేశాయన్నారు. సభకు ఆత్మీయ అతిథిగా విచ్చేసిన గాడి చర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ సాహిత్య అకాడమీ దేశవ్యాప్తంగా భాషా సాహిత్యాలకు వెన్నుదన్నుగా నిలుస్తుందని తొలి అధ్యక్షులుగా నెహ్రూ పనిచేశారని గుర్తు చేశారు. సాహిత్య అకాడమీకి రాజకీయాలకతీతమైన భావజాలం ఉందని అన్నారు.

మాట్లాడుతున్న కెంగార మోహన్

ప్రగతిశీల విప్లవ కథలు అంశంపై డాక్టర్ కె.నాగేశ్వరాచారి మాట్లాడుతూ 1955 రాబోయే కలకత్తా, అక్టోబర్ గురజాడ సంస్కర్త, ఉదయం ఇప్పటికీ కథలలో కనపడుతాయన్నారు. జాతీయోద్యమం, సామాజిక చైతన్యం, తెలంగాణ ఎర్రజెండా గంగినేని వెంకటేశ్వరరావు మూడు సంపుటాలు విప్లవోద్యమం నిర్వచనాలుగా నిలిచాయన్నారు. మైనార్టీ కథలపై ఇనాయతుల్లా మాట్లాడుతూ మైనార్టీల పేదరికం, వివక్ష, హిందూ దాష్టీకం వల్ల కథలు విస్తృతమయ్యాయన్నారు. అనేక కథలను వివరించారు. బహుజన దళిత గిరిజన కథలుపై జి.వెంకటకష్ణ మాట్లాడుతూ కథ కావ్యం పురాణాల్లో వేదాల్లో నవలల్లో ఉంటుందన్నారు. కథానిక మాత్రం ఒక చిన్న విషయం మేలుకొలుపు మధ్యతరగతి ప్రజల ఆలోచనలను పంచుకోవడం కోసం వచ్చిందన్నారు. దళిత కథానిక కారంచేడు ,చుండూరు, వేంపెంట 1990 తర్వాతనే ఈ వాదాల కథలు వచ్చాయన్నారు. అనేక కథలను, కథానికలను ఉదహరించారు. మారుతి పౌరోహితం మాట్లాడుతూ ప్రాంతీయ తెలుగు కథ అస్తిత్వం ప్రధానం కథాంశంగా ఉంటుందన్నారు. అస్తిత్వవాద కథలు, కళింగాంధ్ర రాయలసీమ, తెలంగాణ అట్టాడ అప్పలనాయుడు ఆశారని తెలుగు సాహిత్యంలో ఇవి ప్రముఖ పాత్ర పోషించాయని అన్నారు. నలుగురు వక్తలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశానికి సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ ప్రారంభించగా వందన సమర్పణను సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు చేశారు. సమావేశంలో సాహితీస్రవంతి జిల్లా అధ్యక్షులు ఆవుల బసప్ప, జిల్లా నాయకులు, ఎన్.నాగమణి, పులిచేరి మహేశ్ కుమార్, డాక్టర్ సక్కిరి భాస్కర్, విజయులు తనగల, ఓంకార్, మధు బాలగౌని, పానుగంటి చంద్రయ్య, కవులు గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, కళ్యాణదుర్గం స్వర్ణలత, డాక్టర్ దండబోయిన పార్వతీదేవి, ఎస్‌డివి అజీజ్, రత్నం ఏసేపు, ఎవి రెడ్డి , మధుసూదన శర్మ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటకృష్ణ, వక్త మారుతీ పౌరోహితంకు ప్రశంసాపత్రం అందజేస్తున్న చంద్రశేఖర కల్కూర , తదితరులు

నేడు పల్లకి మహోత్సవం

డిప్యూటీ కమిషనర్ వాణి

జిల్లా న్యాయమూర్తులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఆయల అధికారులు

ప్రజాశక్తి-కౌతాళం

ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలలో ఒకటైన లక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకి మహోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు దేవాలయ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ పూజల అనంతరం స్వామివారికి తుంగభద్ర నది జలాలతో జలాభిషేకం కోసం కందుకూరు గ్రామానికి చేరుకోవడం జరుగుతుందన్నారు. అక్కడ వేద పండితుల ఆధ్వర్యంలో తుంగభద్ర నదిలో అభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు భక్తుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు. కందుకూరు నుండి తిప్పల దొడ్డి, కరణి, మల్లన హట్టి చిరుతపల్లి గ్రామాలలో పల్లకి ప్రవేశించి ఉరుకుంద గ్రామానికి చేరుకుంటుందన్నారు. దేవాలయ అధికారులు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో భాజా భజంత్రీలతో మేళతాళలతో స్వాగతం పలికి ఊరేగింపుగా తీసుకువస్తారన్నారు. ఇక్కడ వేలాది మంది భక్తులు పూజలు చేసి కొబ్బరికాయలు కొడతారు. అనంతరం స్వామి వారు దేవాలయంలో ప్రవేశిస్తారని అన్నారు. పల్లకి మహోత్సవానికి వచ్చే వేలాది మంది భక్తులకు సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. అధికారులు గ్రామ ప్రజలు ప్రజానిధులు సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఈరన్న స్వామి సన్నిధిలో జడ్జిలు

శ్రీ లక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి, ఆదోని సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ సుధా, ఆదోని సబ్‌డివిజనల్ జడ్జి యజ్ఞ నారాయణ దర్శించుకుని ఆదివారం పూజలు నిర్వహించారు. దేవాలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలి కారు. శాలువతో సత్కరించి పూలమాలలతో సన్మానించారు. సిఐ అశోక్ కుమార్, పర్యవేక్షకులు వెంకటేష్, ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి పాల్గొన్నారు.

రైస్ మిల్ నారాయణరెడ్డికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-నందవరం

టిడిపి సీనియర్ నాయకులు హాలహర్వి గ్రామానికి చెందిన మిల్లు నారాయణరెడ్డిని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పరామర్శించారు. కొన్ని రోజుల క్రితం ఆయన అనారోగ్యానికి గురయ్యారు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం ఆయన నివాసానికి చేరుకున్నారు. విషయస్త తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం ఆయన నివాసానికి చేరుకుని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు టిడిపి బిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాధవరావు దేశాయ్, మండల కన్వీనర్ కాసీంవలి, ధర్మాపురం గోపాల్, హాలహర్వి గ్రామ అధ్యక్షులు ఎర్రన్న, నాగరాజు, మణికుమార్, కొండారెడ్డి, కడబూరి పాల్గొన్నారు.



రైస్‌మిల్ నారాయణ రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బివి, ఇతర నాయకులు

ఎమ్మిగనూరు ఎమ్మెల్యేకు పూలబొకేతో స్వాగతం పలుకుతున్న వడ్డెగోపాల్

వడ్డే గోపాల్ నూతన గహప్రవేశ వేడుకలో ఎమ్మెల్యే

నందవరం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు వడ్డే గోపాల్ నూతన గృహప్రవేశ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించి బొకేను అందించి ఘనంగా ఆహ్వానం పలికారు. గృహంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన గృహంలో సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నాగరాజు గౌడ్, చిన్న రాముడు, వీరేష్, గ్రామ అధ్యక్షులు భీమాశేఖర్, వడ్డే మురళి పాల్గొన్నారు.

హైవేపై గుంతను పూడ్చిన..హెడ్ కానిస్టేబుల్ రాముడు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రమాదాలకు కారణమైన గుంతను పూడ్చి వాహన దారుల నుండి హెడ్ కానిస్టేబుల్ రాముడు ప్రశంసలు అందుకుంటున్నారు. మంత్రాలయం నుండి ఎమ్మిగనూరు వైపు వెళ్లే హైవేపై పడిన గుంతను ఆయన ఆదివారం పూడ్చి సామాజిక సేవలో పాలు పంచుకున్నారు. జాతీయ రహదారి 167పై పడిన గుంత కారణంగా చాలా మంది వాహన దారులు ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఇటీవల స్థానిక విద్యుత్ శాఖలో పని చేస్తున్న లైన్ మెన్లు భీమయ్య, రషీద్‌లు రాత్రి ద్విచక్ర వాహనంపై ఎమ్మిగనూరుకు వెళుతుండగా హైవేపై పడిన గుంతను గమనించక గుంతలో పడి స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఈ విషయాన్ని తోటి లైన్‌మెన్లు చాంద్ బాషా, ప్రదీప్‌లకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా వారు ద్విచక్ర వాహనంపై వస్తూ అదే గుంతలో పడి ఒక్కొక్కరికి ఒక్కో కాలు విరిగింది. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. రోజూ ఎమ్మిగనూరు నుండి మంత్రాలయంకు విధి నిర్వహణకు వస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాముడు మరో వ్యక్తి సహాయంతో గుంతలో మట్టిని వేసి పూడ్చారు. విషయం తెలుసుకున్న సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్‌లు ఆయన్ను అభినందించారు. హైవే రోడ్డు నిర్వహణ బాధ్యత హైవే అధికారులు చొరవ చూపకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు విమర్శిస్తున్నారు.

సర్పంచి సహకారంతో బాగుపడిన రోడ్డు

ప్రజాశక్తి- చిప్పగిరి

చిప్పగిరి నుంచి ఏరూరు మీదుగా దేగులపాడుకు వెళ్ల రోడ్డంతా కూడా కంకర తేలి గుంతలు పడడంతో రోజు వెళ్లవలసిన బస్సు కూడా గత రెండు వారాలుగా నిలుపుదల చేశారు. బస్సు ఏరూరు, దేగులపాడుకు వెళ్లకపోవడంతో ప్రతిరోజు వెళ్లే విద్యార్థులు చాలా అవస్థలు పడవలసి వస్తుంది. వారితో పాటు పనుల మీద వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీరు ఇబ్బందులు చూసి గుంతకల్లు డిపో మేనేజర్ గంగాధర్‌కు దేగులపాడు సర్పంచి నీలకంఠ వెళ్లి ఎందుకు బస్సు నడపడం లేదని అడిగిన ఫలితం లేకుండా పోయింది. బస్ డిపో మేనేజర్ మీ రోడ్డు సరిగా లేదని కంకర గుంతలు పడి ఉందని వాటిని సరి చేస్తే అప్పుడు బస్సు నడుపుతామని కరాకండిగా సర్పంచుకు బదులిచ్చారు. విద్యార్థుల ఇబ్బందులు చూసి సర్పంచు నీలకంఠ తన సొంత నిధులతో ఆదివారం ట్రాక్టర్లు ద్వారా గ్రావెల్ వేయించి జెసిబి ద్వారా చదును చేయించారు. ఇప్పటికైనా గుంతకల్ డిపో మేనేజర్ గంగాధర్ స్పందించి దేగులపాడుకు వెళ్లే బస్సును తిరిగినడపాలని ఇరు గ్రామాల ప్రజలు , ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. సొంత నిధులతో గ్రావెల్ వేయించినందుకు సర్పంచి నీలకంఠను ఇరు గ్రామాల ప్రజలు అభినందించి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాధనం నీళ్ల పాలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో అభివృద్ధి కుంటపడింది. ప్రజాధనంతో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ అర్ధాంతరంగా నిలిచిపోయింది. వర్షాలతో షాపింగ్ కాంప్లెక్స్ కోసం వాడిన ఇనుము తుప్పుపట్టి ప్రజాధనం నీళ్ల పాళ్ల పాలయిందని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

తెగని పేచి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఇరువురి మధ్య పేచీ వ్యవహారం కొలిక్కి రాకపోవడంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం నిలిచిపోయిందని పలువురు వాపోతున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు 2024 మార్చి నెలలో అప్పటి ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. లబ్ధిదారులు చెల్లించిన మొత్తంతో కాంట్రాక్టర్ రాజేంద్రప్రసాద్ పనులు చేపట్టారు. పనులు సజావుగా సాగినా.. ప్రభుత్వ మారడం ఎమ్మెల్యేగా పార్థసారథి బాధ్యతలు తీసుకున్నారు. జరిగిన పనులకు బిల్లు చెల్లింపుల్లో ఇరువురు మధ్య పేచి మొదలైంది. దీంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇసుక కొరత ఉందని విద్యుత్ స్తంభాలు అడ్డంగా ఉన్నాయన్న కారణాలు చూపుతూ పనులు మొదలు పెట్టకుండా వాయిదా వేస్తూనే వచ్చారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆ ప్రదేశంలో నీళ్లు నిలిచి చెరువును తలపిస్తోంది.

ఆదోనిలో పురోగతి కరువు : రాష్ట్రంలో రెండో పురాతన మున్సిపాలిటీగా ఆదోనికి పేరు ఉంది. మున్సిపాలిటీగా ఏర్పడి 150ఏళ్ళు అవుతుంది. అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఆదోని అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నామని పాలకులు చెబుతూనే ఎవరి పంతానవారే అన్న రీతిలో వ్యవహరించడంలో పనులు పెండింగ్లో ఉన్నాయి. సుమారు రూ. 33 కోట్ల వ్యయంతో మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం గతేడాది మార్చిలో శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 4 కోట్ల వరకు ఖర్చయింది. గ్రౌండ్ లెవెల్ వరకు పని జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పని 20శాతం కన్నా తక్కువ ఉందన్న కారణం చూపి పనులు నిలిపివేశారు. లబ్ధిదారులు చెల్లించిన మొత్తంతోనే కాంప్లెక్స్ నిర్మాణం జరగాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో పనులు మొదలయ్యాయని నాణ్యత లేదని ఎమ్మెల్యే పార్థసారథి అభ్యంతరం చెప్పడంతో కాంట్రాక్టర్ రాజేంద్రప్రసాద్ పనులు నిలిపివేశారు. పనులు ప్రారంభించాలని సుమారు రూ. 3కోట్ల వరకు కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించాలని వైసిపి కౌన్సిలర్లు గతంలో పట్టుబట్టారు. అప్పట్లో ఎమ్మెల్యే సమ్మతించకపోవడంతో పనులకు బ్రేక్ పడింది. కాంట్రాక్టర్ కోర్టుకు వెళ్లి పెండింగ్లో ఉన్న బిల్లులు ఇవ్వాలని కోరడంతో అందుకు సంబంధించిన ఆర్డర్ కాపీ అధికారులకు త్వరలో వస్తుందని చెబుతున్నారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇప్పటికైనా చొరవ తీసుకుని పనులు మొదలయ్యేలా చూడాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. దుకాణాల కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించుకోలేక పోతున్నామని లబ్ధిదారులు శంకర్ రావు, ఈరన్న తదితరులు వాపోతున్నారు. పనులు చేపట్టకపోతే డిపాజిట్లు తిరిగి ఇవ్వాలని కోరుతున్నారు.

నీట మునిగిన అర్ధాంతరంగా నిలిచిపోయిన షాపింగ్‌కాంప్లెక్సు పనులు

పనులు మొదలు అయ్యేలా చర్యలు

- కృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదోని

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో వర్షపు నీరు నిలిచింది. ఆ నీటిని బయటకు తోడించేందుకు మోటార్లు ఏర్పాటు చేయించాము. కాంట్రాక్టర్ నీటిని బయటకు తొడిసిస్తున్నారు. జరిగిన పనులకు సంబంధించి వివరాలు రికార్డు చేయించాము. అందుకు సంబంధించిన బిల్లులు చెల్లింపుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నాము. ప్రస్తుతం సమస్య కోర్టు పరిధిలో ఉంది. అక్కడి నుండి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి తదుపరి నిర్ణయం తీసుకుంటాం.

జర్నలిస్టులు విలువలు పాటించాలి: ఎస్ఐ

ప్రజాశక్తి-మంత్రాలయం

సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, జర్నలిస్టులు విలువలు పాటించాలని ఎస్ఐ శివాంజల్ సూచించారు. ఆదివారం ఎపిడబ్ల్యుజె 69వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జండా విష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా రాసి సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు షబ్బీర్ దేశాయ్ ,వేణుగోపాల్ రెడ్డి ,చంద్ర శేఖర్, మధుసూదనాచారి తో పాటు ఎస్ఐ శివాంజల్‌ను శాలువలతో పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు చాంద్ బాషా, కార్యవర్గ సభ్యులు సూర్య నారాయణ, ఆచార్, గౌరవ అధ్యక్షులు వీరశేఖర్ శెట్టి, అధ్యక్షులు జయరాజు, ప్రధాన కార్యదర్శి హుసేంజీరావు, కోశాధికారి సాబువలి, తదితర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

విలేకరులను అభినందిస్తున్న ఎస్ఐ శివాంజల్

వాల్మీకులు ఎస్‌టి జాబితాలో చేరేలా ఉద్యమం

ప్రజాశక్తి - ఆదోని

బోయ, వాల్మీకిల చిరకాల కాంక్ష ఎస్టీ జాబితాలోకి చేర్చాలని మరో ఉద్యమానికి సిద్ధం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. జేబీ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఎమ్మెల్యే పార్థసారథి, ఎమ్మెల్సీ బిటి నాయుడు, బోయ కార్పొరేషన్ చైర్మన్ బుజ్జమ్మ, టిడిపి ఆదోని నియోజకవర్గం మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది క్రిష్ణమ్మలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. సామాజికంగా, విద్య పరంగా వెనుకబడ్డ బోయ సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని దశాబ్ద కాలంగా ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవం లేదన్నారు. సమావేశంలో మంత్రాలయం రామకృష్ణారెడ్డి, కౌతాళం సురేష్ నాయుడు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, పంపాపతి, మాజీ జెడ్పిటిసి రాంబీం నాయుడు, గోనెగండ్ల ప్రభాకర్ నాయుడు, ఎమ్మిగనూరు మాజీ ఎంపీపీ శంకరయ్య, ఇఎంబి లక్ష్మన్న, బిఎల్ నారాయణ, యాపిలయ్య, నందవరం లింగమూర్తి, నారాయణ, క్రిష్ణగిరి వీరభద్రుడు, వెల్దుర్తి గోపి, గూడూరు ఎల్ వెంకటేశ్వర్లు, శేషు, బెలగల్ మద్దిలేటి, లక్ష్మన్న, కోడుమూరు గోపాల్ నాయుడు పాల్గొన్నారు.

రౌంట్‌టేబుల్‌లో మాట్లాడుతున్న నాయకులు, వేదికపై పార్థసారథి, బిటి,నాయుడు

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

పజాశక్తి - దేవనకొండ

మండల పరిధిలోని స్థానిక బీసీ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త పూడు కేశన్న (60) అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న టిడిపి నేతలు బడిగింజల రంగన్న, ఆకుల వీరేష్, బండ్లయ్య, మస్తాన్, సుభాన్, రాముడు కుటుంబాన్ని పరామర్శించి రూ.5000 ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలన్నారు. టిడిపి నుండి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల సందడి

-ప్రయివేటు వాహనాలతో ట్రాఫిక్ సమస్య

ప్రజాశక్తి- మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలో భక్తుల సందడి నెలకొంది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వరుసగా సెలవులు రావడంతో స్వామి వారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి దర్శనార్థం ప్రైవేటు వాహనాల్లో వచ్చిన భక్తులు తమ వాహనాలను రోడ్డు పై ఉంచడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రమణ పోలీసు జమీర్, హోంగార్డ్ ఖాజా, మెహబూబ్ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా నియంత్రణలో నిమగ్నమయ్యారు.

మెరుగైన విద్యకు మారుపేరు ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్

ప్రజాశక్తి-ఆదోని

మెరుగైన విద్యకు మారుపేరుగా ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ ,ఆర్ఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్సెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్సెస్ కాలేజ్ కు పేరు ఉందని ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ శివ రాముడు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు నర్సింగులో చేరి కోర్సు పూర్తి కాగానే ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఆదోనిలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని ఆర్ఎస్ నర్సింగ్ కళాశాల ఉందన్నారు జనరల్ నర్సింగ్ చదివేందుకు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఆదోనిలోనే చదివే వెసలబాటు కల్పిస్తున్నామన్నారు. వైద్య రంగంలో స్థిరపడే వారికి జనరల్ నర్సింగ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తమ కళాశాలలో జీఎన్ఎం, జనరల్ నర్సింగ్, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మల్టీపర్పస్,హెల్త్ అసిస్టెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇందులో ప్రభుత్వ ఉచిత సీట్లకు ముందుగానే రిజర్వే చేసుకున్న వారికి ఇస్తామని చెప్పారు. ఈ కోర్సులను పూర్తి చేసిన వారికి దేశ, విదేశాల్లో అపారమైన ఉద్యోగావకాశాలు, ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. మండల, గ్రామ కేంద్రాల్లో ఆర్ఎంపి గా ప్రాక్టీస్ చేసుకునే అవకాశం తో పాటు ఆర్టీసి, రైల్వే, ఇఎస్ఐ, 108, 104 వైద్య విభాగాలలో ఎక్కువ ఉద్యోగ అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక హెల్త్ కేంద్రాలు, విలేజ్ క్లినిక్ లో ఉద్యోగానికి అర్హులన్నారు. వైద్యరంగంలో స్థిరపడే వారు సత్వరమే ఉపాధి పొందేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 7702894254, 9581 7752 30 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అధ్వాన రహదారులకు మోక్షం ఎప్పుడో..?

-నరకప్రాయంగా మారిన రహదారులు

ప్రజాశక్తి - దేవనకొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రహదారుల అభివృద్ధికి లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వాలు, పాలకులు మారినప్పటికీ గ్రామీణ రోడ్లు అభివృద్ధి చెందడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి ఐదేళ్లకు ఒక్కసారి వచ్చే ఎన్నికల్లో మాత్రం రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు బూటకపు వాగ్దానాలు చేస్తున్నారే తప్ప రహదారుల అభివద్ధికి మాత్రం చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని పి. కోటకొండ క్రాస్ రోడ్డు నుండి బేతపల్లి రహదారి కంకర తేలి ఆధ్వానంగా, నరకప్రాయంగా మారింది. పుల్లాపురం గ్రామం నుండి తెర్నేకల్ గ్రామానికి 3 కిలోమీటర్ల పరిధిలోని మట్టి రహదారి గుంతలమయంతో పలు అవస్థలు పడుతున్నామని ఆ గ్రామ ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. రహదారి మధ్యలో కల్వర్టు పూర్తిగా కుంగిపోవడంతో వర్షాలు అధికంగా వస్తే రాకపోకలు కూడా తిరిగే పరిస్థితి లేదని ఆ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బేతపల్లి రహదారి పూర్తిగా దెబ్బ తినడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైన పరిస్థితులు ఉన్నాయి. ఆ రహదారి వెంబడి బంటుపల్లి, చెల్లెలచలిమల, బండపల్లి, తెగదొడ్డి, లక్కసాగరం తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కంకర తేలి గుంతలు పడి నరకప్రాయంగా మారిన రహదారిపై రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని పట్టణాలకు తీసుకెళ్లాలంటే పలు అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. అత్యవసర రోగులు, గర్భిణీలను వైద్య చికిత్సలకు తీసుకెళ్ళేందుకు పలు అవస్థలు ఎదుర్కొంటున్నామని ఆ గ్రామ ప్రజలు తెలిపారు. కుండ గ్రామం నుండిపల్లె దొడ్డి, కె.వెంకటాపురం, బుర్రకుంట రహదారి, కప్పట్రాళ్ల స్టేజి నుండి బండగట్టు రహదారి, కరివేముల గ్రామం నుండి జిల్లేడుబుడకల, భైరవానికుంట, తిప్పతలమరి మట్టి రహదారులు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆయా గ్రామ ప్రజలు వాపోతున్నారు. ప్రతి ఐదేళ్లకు ఒక్కసారి వచ్చే ఎన్నికల్లో మాత్రం శాసనసభ, పార్లమెంట్ అభ్యర్థులు రహదారుల అభివృద్ధి చేస్తామని చెప్పడమే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదని ఆయా గ్రామ ప్రజలు ఆరోపించారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా తమ గ్రామీణ రహదారులు మాత్రం అభివృద్ధి చెందడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, పాలక ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు తమ రహదారులను అభివృద్ధి చేయాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కంకర తేలి నడవడానికి వీలు కాని రోడ్డు

బేతపల్లి రహదారిని తక్షణమే నిర్మించాలి

వీర శేఖర్, సిపిఎం జిల్లా నాయకులు

పి కోటకొండ బస్ స్టేషన్ క్రాస్ రోడ్డు నుండి బేతపల్లికి వెళ్లే రహదారి కంకర తేలి గుంతల మయమైన రహదారిని తక్షణమే నిర్మించాలి. ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లే పరిస్థితి లేదు. నరకప్రాయంగా మారిన ఈ రహదారిపై పలువురు వాహన దారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. రహదారి అభివృద్ధి చెందితే రైతులు తమ పంట ఉత్పత్తులను కూడా తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడకుండా ఉంటుందన్నారు. పాలక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలి.

రహదారిని అభివృద్ధి చేయండి

హనుమన్న, పుల్లాపురం



పుల్లాపురం గ్రామం నుండి తెర్నేకల్లు గ్రామానికి వెళ్లే 3 కిలోమీటర్ల మట్టి రోడ్డు గుంతలపడి అధ్వాన స్థితికి చేరుకుందని రహదారిని అభివృద్ధి చేయాలన్నారు. రహదారి మధ్యలోని కల్వర్టు కృంగిపోవడంతో అధిక వర్షాలు కురుస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిని బాగు చేయాలన్నారు

వర్షాలకు కూలిన యాటకల్లు బ్రిడ్జి

- నిలిచిపోయిన రాక పోకలు

ప్రజాశక్తి-ఆస్పరి

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని యాటకల్లు సమీపంలో ఉన్న బ్రిడ్జి ఆదివారం కూలిపోయి ఆస్పరి, ఎమ్మిగనూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. నిత్యం ఈ బ్రిడ్జిపై నుండి యాటకల్లు, తొగలగళ్ళు, కలపరి, దోడగొండ, కైరుప్పల గ్రామస్తులు ఆస్పరికి పని నిమిత్తం వస్తూ వెళ్తుంటారు. బ్రిడ్జి శిథిలావస్థకు చేరి చాలా సంవత్సరాలైనప్పటికీ పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకోక పోవడంతో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు బ్రిడ్జి కుప్పకూలి పోయింది. బ్రిడ్జి కింద భాగంలో ఉన్న గోడ పూర్తిగా ధ్వంసం అయింది. నిత్యం ఈ బ్రిడ్జి పై నుండి ఆస్పరికి వందలాది వాహనాలు వస్తుంటాయి. బ్రిడ్జి మరో వైపు ఎప్పుడు కూలుతుందో నని వాహనదారులు భయం భయంతో వెళ్తున్నారు. పొరపాటున వాహనాలు వెళ్లే సమయంలో మిగిలి ఉన్న బ్రిడ్జి కూలితే పెద్ద ఎత్తున ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా పంచాయతీరాజ్ అధికారులు స్పందించి కూలిన బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.

యాటకల్లు బ్రిడ్జి కూలిపోయి అగినరాకపోకలు

33 ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో 1991-92 చెందిన పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారంతా ఒకరిని చూసి ఒకరు భావోద్వేగానికి లోనయ్యారు. 33ఏళ్ల తర్వాత తమతో చదువుకున్న స్నేహితులంతా ఒకే చోట కలుసుకోవడంతో యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లర్లను జ్ఞాపకం చేసుకున్నారు. మైదానంలో ఆటలు ఆడుకోవడానికి పోటీపడేవాళ్ళం.. గుర్తుందా అంటూ సాయంత్రం వరకు అక్కడే గడిపారు. వివిధ ప్రాంతాల్లో వృత్తులలో స్థిరపడి ఒకే చోట కలుసుకోవడం పట్ల వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నాడు విద్యా బుద్ధులు నేర్పిన గురువులు రావడాన్నీ చూసి పాదాభివందనం చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాలకు అవస రమైన స్టేజీని సొంత ఖర్చులతో నిర్మించి అంకితం చేశారు. నాటి గు రువులు రామకృష్ణ, హెడ్ మాస్టర్ ఫయాజ్, సునీల్, వరప్రసాద్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మంగమ్మ, కళావతి, శ్రీను, హరి, అమర్ ప్రకాష్, కృష్ణా,ప్రకాష్,విజయ్,జమీర్,సత్య,విజయ,హరి పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీలను నెరవేర్చిన సీఎం

ప్రజాశక్తి - ఆదోని : ఎన్నికల సందర్భంగా రైతులకిచ్చిన హామీలను సీఎం చంద్రబాబు అమలు చేస్తూ అన్నదాత కళ్ళల్లో ఆనందం నింపారని కూటమి నాయకులు తెలిపారు. ఆదివారం ఆదోనిలో ట్రాక్టర్లతో రైతు మహోత్సవం సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి, ఎమ్మెల్సీ బిటి నాయుడు, కురుబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప, మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ, నియోజకవర్గ టిడిపి అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఉమాపతి నాయుడు, భూపాల్ చౌదరి, మారుతి నాయుడు హాజరయ్యారు.

ర్యాలీ ఆలస్యంతో అలిగిన టిడిపి నేతలు కార్యకర్తలు : ట్రాక్టర్ ర్యాలీని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానం నుండి ఉదయం 9 గంటలకు ప్రారంభించాలని నిర్ణయించిన ఎమ్మెల్యే పార్థసారథి రాకపోవడంతో ఆలస్యమైంది. టిడిపి నాయకులు కార్యకర్తలు అలిగి ఆందోళన చేశారు. ర్యాలీని ఎమ్మెల్సీ బీటి నాయుడు నాయకత్వంలో ప్రారంభించేందుకు టిడిపి నాయకులు సిద్ధం కాగా బిజెపి నాయకులు అడ్డుకొని ఎమ్మెల్యే వచ్చేవరకు ర్యాలీని ప్రారంభించరాదని నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు టిడిపి, బిజెపి నాయకులు మధ్య వాగ్వివాదం జరిగింది. చివరకు ర్యాలీని రెండు గంటల ఆలస్యంగా ప్రారంభించగా మధ్యలో ఎమ్మెల్యే వచ్చి ర్యాలీలో చేరారు.